క్లుప్తంగా

ట్రాఫిక్ పోలీసులకు కూలింగ్ బాటిల్స్ అందజేత



ఎస్‌ఐ రాజుకు వాటర్ బాటిల్ అందజేస్తున్న శ్రీనురమేష్

పెదగంట్యాడ: వేసవి కాలంలో మండుటెండలో విధులు నిర్వర్తించే ట్రాఫిక్ పోలీసులు ఆరోగ్యంపై దృష్టి సారించాలని స్టీల్‌సిటీ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కేసారపు శ్రీనురమేష్ కోరారు. పోలీసులకు 25 కూలింగ్ వాటర్ బాటిల్స్, 25 కూలింగ్ కళ్లద్దాలను అందించారు. వాటిని న్యూపోర్టు ట్రాఫిక్ ఎస్‌ఐ పెద్దాడ రాజుకు మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కేసారపు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మాస శివరాత్రి పూజలు



ఉక్కు శివాలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ బీసీ గేటు వద్ద ఉమా రామలింగేశ్వర ఆలయంలో మంగళవారం మాస శివరాత్రి పూజలను భక్తిశ్రద్ధలతో చేశారు. ఆలయ ఆవరణలో ఉన్న దేవతా మూర్తులను అలంకరించి, పూజలు చేశారు. వేకువజామున ఉమా రామలింగేశ్వరులకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం నిర్వహించిన అన్న సమారాధనలో భక్తులు, ఉద్యోగులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని అన్న ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు భద్రు నాయక్, రాధాకృష్ణ, ఎల్లేటి శ్రీనివాసరావు, సుధాకర్, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లు నిబంధనలు పాటించాలి



స్టిక్కర్లను ఆవిష్కరిస్తున్న ఆర్టీవో సత్యంనాయుడు

గాజువాక: ఆటో డ్రైవర్లు నిబంధనలను పాటిస్తే అన్ని వర్గాల నుంచి సహకారం లభిస్తుందని ఆర్టీవో సత్యంనాయుడు అన్నారు. గాజువాక ఆటో యూనియన్ జోన్-1, జోన్-2 స్టిక్కర్లను మంగళవారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రయాణికుల మన్ననలను పొందడమే లక్ష్యంగా సేవలను అందించాలని సూచించారు. యూనియన్‌కు పేరు వచ్చే విధంగా ఆటో డ్రైవర్లు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో గాజువాక ట్రాఫిక్ ఎస్‌ఐ అప్పలనాయుడు, యూనియన్ వ్యవస్థాపకుడు గొలగాని నాయుడు, స్థానిక నాయకులు బాటా శ్రీనివాస్, అప్పలసూరి తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథికి నిత్యావసర సరకుల అందజేత



లక్ష్మిని పరామర్శిస్తున్న నాయకులు

గాజువాక: జీవీఎంసీ 65వ వార్డు సంజీవగిరి కాలనీకి చెందిన వైఎస్సార్‌సీపీ గృహ సారథి వల్లభ లక్ష్మికి ఆ వార్డు పార్టీ నాయకులు నిత్యావసర సరకులను అందజేశారు. ఆమె ఇటీవల జారి పడిపోవడంతో కాలికి దెబ్బ తగిలింది. దీంతో స్పందించిన వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఆమె ఇంటికి వెళ్లి మంగళవారం పరామర్శించారు. సీనియర్ నాయకుడు మద్దాల అప్పారావు ఆర్థిక సాయంతో నెలకు సరిపడా నిత్యావసర సరకులను ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో మొదలవలస లోకనాథరావు, నాగిశెట్టి శ్రీను, ఇరోతి గణేష్, సలాది సత్తిబాబు పాల్గొన్నారు.

మలుపులు.. ప్రమాదాలకు నెలవులు

హడలిపోతున్న వాహనచోదకులు



ప్రమాదకరంగా ఉన్న ఫకీర్‌తక్యా వీఎస్‌సీ సెంటర్ వద్ద రోడ్డు



మాతృశ్రీ లేవుట్ దగ్గర ప్రమాదకరంగా ఉన్న మలుపులు

కూర్మన్నపాలెం: కూర్మన్నపాలెం పరిధిలోని పలు ప్రాంతాల్లో మలుపులు ప్రమాదకరంగా ఉన్నాయి. ఫకీర్‌తక్యా వీసీఎస్ సెంటర్, దువ్వాడ మాతృశ్రీనగర్ లేఅవుట్, రాజీవ్‌నగర్‌కు వెళ్లే రహదారిపై ప్రయాణం చేయాలంటేనే వాహనచోదకులు భయపడే పరిస్థితి నెలకుంటోంది. ఈ మార్గంలో మూడు ప్రమాదకరమైన మలుపులతో పాటు రోడ్లు కూడా అధ్వానంగా ఉన్నాయి.

ఆటోనగర్ నుంచి రాజీవ్‌నగర్ వైపు వెళ్లే రహదారిలో ఫకీర్‌తక్యా సమీప కూడలి వద్ద నిత్యం ప్రమాదాలు సంభవిస్తుండడంతో ప్రజల్లో భయాందోళన వ్యక్తమవుతోంది. నాలుగు రోడ్ల కూడలి కావడం, రోడ్లు పాడైపోయి ఉండడం, పక్కనే మలుపు ఉండడంతో ప్రమాదాల సంఖ్య అధికంగా ఉంది. కనీసం మలుపుల వద్ద హెచ్చరిక బోర్డులు లేకపోవడంతో రహదారి తీరు గమనించే పరిస్థితి లేక వాహనచోదకులు అదుపు తప్పుతున్నారు. దీంతో ప్రమాదాలు మరింతగా పెరుగుతున్నాయి.

నిత్యం రద్దీ

ఇక్కడ ఆటోనగర్‌లో పరిశ్రమలు ఉండడం, మరో వైపు గ్రీన్‌సిటీ, ఫకీర్‌తక్యా కాలనీ, ఇంకోవైపు వీఎస్ఈజెడ్ పరిశ్రమ ఉన్నాయి. అందువల్ల ఆయా సంస్థల్లో పని చేస్తున్న ఉద్యోగులు వ్యాపార లావాదేవీలు, ఇతర కూలి పనుల నిమిత్తం వెళ్లే కాలనీవాసులు నిత్యం అదే రహదారి మీదుగా ప్రయాణం చేస్తూ ఉంటారు. ఈ జంక్షన్‌లోనే కొంతమంది దుకాణాలు పెట్టి వ్యాపారాలు చేస్తుండడంతో దుకాణాలకు వచ్చే వారు తమ వాహనాలను సైతం అడ్డదిడ్డంగా పార్కింగ్ చేస్తున్నారు. దీంతో వాహనాలు సాఫీగా వెళ్లే మార్గం లేక ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటోంది. ఆ జంక్షన్ వద్దకు వెళ్లే వాహనదారులకు ఎవరు ఎటు నుంచి వస్తున్నారో తెలియని పరిస్థితి నెలకుంటోంది. దీంతో ఒకరినొకరు ఢీకొనడం, గాయాలపాలవడం సాధారణమై పోయింది.

ఈ రహదారి గుండా ఆటోనగర్, వీఎస్ఈజెడ్‌కు వేలాది మంది ఉద్యోగులతో పాటు సరకు రవాణా చేసే భారీ వాహనాలు కూడా అధిక సంఖ్యలో ప్రయాణం చేస్తున్నాయి. రహదారి ఇంత ప్రమాదకరంగా ఉన్నా పోలీసులు ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టకపోవడంపై ప్రయాణికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డులో ఎక్కడా కనీసం స్పీడ్‌బ్రేకర్లు గానీ, వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు స్టాపర్ బోర్డులు కూడా ఏర్పాటు చేయకపోవడంపై ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా స్పందించి, చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



అధ్వానంగా ఉన్న రోడ్డుపై ప్రయాణిస్తున్న వాహనాలు

త్వరలోనే స్టాపర్లు ఏర్పాటు చేస్తాం

హెచ్చరిక బోర్డులు, స్టాపర్లను త్వరలోనే ఏర్పాటు చేస్తాం. వాహనచోదకుల్లో అవగాహన కలిగేలా చర్యలు తీసుకుంటాం. రోడ్డుకు ఇరువైపులా దుకాణాలు ఏర్పాటు చేయడం వల్ల రోడ్డు ఇరుకుగా మారుతోంది. దీనిపై జీవీఎంసీ అధికారులకు తెలియజేసినా పట్టించుకోవడంలేదు. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తాం.

–మహాలక్ష్మి, ట్రాఫిక్ ఎస్‌ఐ, దువ్వాడ స్టేషన్

ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు



సమస్యలు పరిశీలిస్తున్న ఏఎంహెచ్‌వో కిరణ్

అగనంపూడి: పారిశుధ్యం విషయంలో ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని జీవీఎంసీ గాజువాక జోన్ ప్రజారోగ్యశాఖ సహాయ వైద్యాధికారి డాక్టర్ కిరణ్ హెచ్చరించారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసిత కాలనీలు పెదమడక, పినమడక, బీసీ కాలనీ వార్డు సచివాలయాల పరిధిలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్య నిర్వహణ విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. చెత్త పన్ను వసూళ్లు, వ్యాపార పన్నుల వసూళ్లను పరిశీలించారు. ప్రజలు రహదారులు, డ్రైనేజీల్లో చెత్త వేయకుండా జీవీఎంసీ సిబ్బందికి సహకరించాలని కోరారు. పందుల ఏరివేతకు చర్యలు తీసుకుంటామని, కుక్కల బెడద లేకుండా జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. పర్యటనలో శానిటరీ సూపర్‌వైజర్ బి.వి.రామారావు, ఎస్‌ఐ సీతారాం పాల్గొన్నారు.

వైభవంగా పరదేశమ్మ పండగ



ప్రత్యేక అలంకరణలో పరదేశమ్మ వారు



అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న భక్తులు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 87వ వార్డు కణితికాలనీలో కొలువుదీరిన పరదేశమ్మ వారి పండగ మహోత్సవాలు మంగళవారం వైభవంగా జరిగాయి. పండగ సందర్భంగా ఉదయం 5 గంటల నుంచి అమ్మవారికి శాస్త్రోక్తంగా పూజలు, అభిషేకాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం, ఏఎంహెచ్‌వో డాక్టర్ కిరణ్‌కుమార్ పాల్గొని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. విద్యుద్దీపాలంకరణ ఆకట్టుకుంది. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. సాయంత్రం 6 గంటల నుంచి కణితి గ్రామంలోని ఈ సేవ గ్రౌండ్స్‌లో భారీ బాణసంచా నడుమ అమ్మవారి అనుపు మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లోముగ్గురు అదృశ్యం

పెదగంట్యాడ: మండలంలోని బీసీ రోడ్డు భానోజీతోటకు చెందిన మతిస్థిమితం లేని ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటనపై న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి.. గుంటూరు రామరాజు భానోజీతోటలో కుటుంబంతో నివాసం ఉంటున్నారు. అతని కుమారుడు గుంటూరు శ్రీనివాసరావు (34) మతిస్థిమితం లేకపోవడంతో ఇంటి వద్దే ఉండేవాడు. ఈ నెల 15 నుంచి ఆ వ్యక్తి కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. చుట్టుపక్కల వెదికినా ప్రయోజనం లేకపోవడంతో న్యూపోర్టు పోలీసులను ఆశ్రయించారు. శ్రీనివాసరావు సోదరుడు వర్మరాజు ఫిర్యాదు మేరకు న్యూపోర్టు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

దువ్వాడ పీఎస్ పరిధిలో ఇద్దరు..

కూర్మన్నపాలెం: దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలో వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం కావడంపై కేసులు నమోదయ్యాయి. దువ్వాడ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. అగనంపూడి పరిధి ఫార్మాసిటీ కాలనీకి చెందిన అమరనేని పూజిత(20) అనే యువతి ఈ నెల 16వ తేదీన అనకాపల్లికి వెళ్లి సర్టిఫికెట్లు తెచ్చుకుంటానని చెప్పి ఇంట్లో నుంచి బయటకు వెళ్లింది. ఆమె తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు చుట్టుపక్కల వెదికినా ఫలితం లేకపోవడంతో యువతి తండ్రి సాంబశివరావు దువ్వాడ పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు యువతి కోసం గాలింపు చర్యలు చేపట్టారు.



కోన చిన్నారావు

- పెదగంట్యాడ మండలం కొంగవానిపాలెం ప్రాంతానికి చెందిన కోన చిన్నారావు(37) గత నెల మార్చి 5వ తేదీ నుంచి కనిపించడం లేదని కేసు నమోదైంది. చిన్నారావుకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్ద కూతురు రక్త సంబంధిత వ్యాధితో బాధపడుతూ బెంగళూరులోని ఓ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఆ సమయంలో కూతురిని చూడడానికి వెళ్లిన చిన్నారావు, తిరిగి విశాఖపట్నం వచ్చే క్రమంలో కనిపించకుండా పోయారు. కుటుంబ సభ్యులు గాలించినా ఫలితం లేకపోవడంతో మావయ్య ఏదూరి అప్పారావు దువ్వాడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు.

ముగిసిన 10వ తరగతి పరీక్షలు

విశాఖ విద్య: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు మంగళవారంతో ముగిశాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా విద్యాశాఖాధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయడంతో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు లేకుండా ప్రశాంతంగా పరీక్షలు జరిగాయి. చివరి రోజైన మంగళవారం ఒకేషనల్ కోర్సు విద్యార్థులకు జరిగిన పరీక్షకు 1,023 మంది నమోదు చేసుకోగా.. 948 మంది హాజరయ్యారు. 92.7 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో చంద్రకళ తెలిపారు.

కాలేయ వ్యాధులపై అప్రమత్తత అవసరం

అక్కిరెడ్డిపాలెం: భారతదేశంలో కాలేయ వ్యాధికి ముఖ్యకారణాలు వైరల్ ఇన్ఫెక్షన్లు, ఆల్కహాల్ అని కిమ్స్ ఐకాన్ క్లినికల్ డైరెక్టర్ అండ్ చీఫ్ ఆఫ్ డిపార్ట్‌మెంట్ (గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్) డాక్టర్ చలపతిరావు ఆచంట అన్నారు. ఏప్రిల్ 19 అంతర్జాతీయ కాలేయ దినోత్సవాన్ని పురస్కరించుకొని షీలానగర్ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో మంగళవారం కాలేయ వ్యాధులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భారతదేశంలో కాలేయ క్యాన్సర్ అత్యంత ప్రమాదకరమైన హెచ్‌బీవీ, హెచ్‌సీవీ ఇన్ఫెక్షన్లు, దీర్ఘకాలిక మద్యపానం వల్ల వస్తుందన్నారు. కాలేయ వ్యాధి నివారణకు టీకాలు వేయించడం అత్యంత ప్రభావవంతమైన మార్గాల్లో ఒకటిగా చెప్పవచ్చన్నారు. కాలేయ వ్యాధులకు గురైన వారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుంటూ, జాగ్రత్తలు పాటించాలని సూచించారు.

వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలి



శానిటరీ అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ కోటేశ్వరరావు

కూర్మన్నపాలెం: జీవీఎంసీ 86వ వార్డులో కార్పొరేటర్ లేళ్ల కోటేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ సంతోష్‌తో కలసి మంగళవారం పర్యటించారు. రావులచెరువు దరి యాతపాలెం వద్ద కాలనీ పరిసరాలను, ఎస్‌టీపీ ప్లాంట్ నుంచి వస్తున్న వ్యర్థ జలాలను పరిశీలించారు. కాల్వల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించి, నీరు నిల్వ లేకుండా చూడాలని శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సిబ్బంది పాల్గొన్నారు.

వరలక్ష్మికి తెలుగు వెలుగు సాహిత్య వేదిక ఆహ్వానం



వరలక్ష్మి

అగనంపూడి: తెలుగు భాషాభివృద్ధికి ఇతోధికంగా కృషి చేస్తున్న ఆంగ్ల ఉపాధ్యాయిని వరలక్ష్మిని తెలుగు బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ ద్వారా, తెలుగు వెలుగు సాహిత్య జాతీయ వేదిక ఘనంగా సత్కరించనుంది. ఈ నెల 30న హైదరాబాద్‌లో నిర్వహించనున్న తెలుగు వెలుగు సాహిత్య వేదిక సంబరాలకు ఆమెకు ఆహ్వానం అందింది. స్థానికంగా నివాసం ఉంటున్న ఎస్.ఎస్.ఎస్. వరలక్ష్మి వాడచీపురుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్ల ఉపాధ్యాయినిగా పని చేస్తున్నారు. ఆమె రచించిన అనేక కవితలు తెలుగు వెలుగుల సాహిత్య వేదిక కవితా సంకలనానికి ఎంపికయ్యాయి. దీంతో ఆమెను ఎస్‌వీ ఫౌండేషన్‌తో కలిపి సాహిత్య వేదిక సత్కరించనుంది.

స్టీల్‌ప్లాంట్ ఆర్‌ఎంహెచ్‌పీ విభాగాధిపతికి అభినందనలు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రా మెటీరియల్ హ్యాండ్లింగ్ ప్లాంట్(ఆర్‌ఎంహెచ్‌పీ) విభాగాధిపతి పరుచూరు శ్రీనివాసులును పలువురు అభినందించారు. నూతన విభాగాధిపతిగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా జోనల్ హెచ్‌ఆర్ డాక్టర్ డి.రాధిక, ఐఎన్‌టీయూసీ చీఫ్ వైస్ ప్రెసిడెంట్ కొమ్ము ప్రసాదరావు నేతృత్వంలో ఎస్సీ, ఎస్టీ నాయకులు కలిసి శాలువా కప్పి, పూలమాలలతో సత్కరించారు. విభాగాదిపతి మాట్లాడుతూ విభాగం అభివృద్ధికి ఉద్యోగులు, సంఘాలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బయ్యే మల్లయ్య, తొడన్న, కారు రమణ, డి.మోహన్, ఎన్. రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధర్నా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీఐటీయూ, మిత్రపక్షాల నాయకులు

ఉక్కునగరం: ఉక్కు కార్మికులకు నూతన వేతనాలు అమలు చేయాలని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు. రామస్వామి డిమాండ్ చేశారు. స్టోర్స్ కూడలి వద్ద మంగళవారం జరిగిన యూనియన్ మిత్రపక్షాల సమావేశంలో ధర్నా గోడపత్రిక ఆవిష్కరించారు. రామస్వామి మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ వ్యూహాత్మక అమ్మకం కోసం.. కార్మికుల మనోధైర్యాన్ని కృంగదీయాలనే నూతన వేతనాలు అమలు చేయలేదన్నారు. యాజమాన్యం మొండి వైఖరిని సీఐటీయూ మిత్రపక్షాలు చూస్తూ ఊరుకోవన్నారు. ఇందులో భాగంగా అన్ని విభాగాధిపతుల కార్యాలయాల వద్ద ధర్నాలు చేసి, ఆయా విభాగాధిపతులకు వినతులు సమర్పించామని చెప్పారు. ఇందులో భాగంగా గురువారం ఈడీ (వర్క్స్) బిల్డింగ్ వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వై.టి.దాస్, శ్రీనివాసరావు, గంగాధర్, టి.వి.కె. రాజు, కె.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రిని కలిసిన 64వ వార్డు నాయకులు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అప్పన్న చిత్రపటాన్ని బహూకరిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని 64వ వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు అమరావతిలో మర్యాదపూర్వకంగా కలిశారు. 'మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమాన్ని నిర్దేశించిన సమయానికంటే ముందుగా, కేవలం ఐదు రోజుల్లోనే పూర్తి చేయడంతో క్లస్టర్ ఇన్‌చార్జి కులుకూరి మంగరాజు, పార్టీ వార్డు అధ్యక్షుడు ధర్మాల శ్రీను, కన్వీనర్లు ధర్మాల వెంకటరెడ్డి, లత, హరీష్‌లను ప్రశంసించారు. ఉత్తరాంధ్ర జిల్లాల్లో 35 నియోజకవర్గాలకు గాను గాజువాక నియోజవర్గం పరిధిలోని 64వ వార్డులో ఈ ఘనత సాధించినట్లు నాయకులు తెలిపారు. అనంతరం సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి వరాహ లక్ష్మీనరసింహస్వామి చిత్ర పటాన్ని బహూకరించారు.

జోరుగా 'మా నమ్మకం నువ్వే జగన్'



మహిళకు సంక్షేమ పథకాల బ్రోచర్ అందిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ చినతల్లి



ఇంటికి స్టిక్కర్ అతికిస్తున్న శంకరనారాయణ

గాజువాక: 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమాన్ని నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ నాయకులు జోరుగా నిర్వహిస్తున్నారు. డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పల్లా చినతల్లి 67వ వార్డు సాయిరామ్‌నగర్ సచివాలయం పరిధిలో మంగళవారం పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి గృహ యజమానుల అనుమతితో మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ కోసం జగన్ మోహన్‌రెడ్డికి ముఖ్యమంత్రిగా మరో అవకాశం కల్పించాలని కోరారు. ప్రభుత్వానికి మద్దతు తెలిపిన వారితో టోల్ ఫ్రీ నంబర్‌కు మిస్డ్ కాల్ ఇప్పించారు. కార్యక్రమంలో పలువురు వార్డు నాయకులు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు పాల్గొన్నారు.

గాంధీనగర్‌లో ..

పెదగంట్యాడ: 76వ వార్డు గాంధీనగర్‌లో మా నమ్మకం నువ్వే జగన్, జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమాన్ని వైఎస్సార్ సీపీ నాయకుడు మంత్రి శంకరనారాయణ నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించారు. కార్యక్రమంలో సచివాలయ కన్వీనర్ ఎస్.శ్రీనివాసరావు, గృహ సారథులు పాల్గొన్నారు.

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ



796వ రోజు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు పరిరక్షణ కోసం కార్మికులు చేస్తున్న ఉద్యమంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 796వ రోజుకు చేరుకున్నాయి. దీక్ష శిబిరంలో సంస్థకు చెందిన సీఎంఎం, సీఈడీ, సీఆర్ఎంపీ తదితర విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే ఉక్కు పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఉక్కును కాపాడుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని, కర్మాగార పరిరక్షణకు ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని సూచించారు. ప్రాణ త్యాగంతో ఏర్పాటైన ఉక్కు పరిశ్రమను కాపాడుకోవడం కోసం ఎలాంటి పోరాటానికైనా సిద్ధం కావాలని కోరారు. ప్రధాని మోదీ అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరును మరింత ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

'ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని తక్షణమే విరమించాలి'



గుడివాడ అప్పన్నకాలనీలో ప్రచార భేరిని నిర్వహిస్తున్న వామపక్ష నేతలు

అక్కిరెడ్డిపాలెం: కేంద్రప్రభుత్వం విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని తక్షణమే విరమించాలని వామపక్షనేతలు డిమాండ్ చేశారు. 68వ వార్డు గుడివాడ అప్పన్నకాలనీలో మంగళవారం ప్రచార భేరి కార్యక్రమాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరలతో పాటు నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేద, మధ్య తరగతి ప్రజల నడ్డి విరుస్తోందన్నారు. ప్రభుత్వ రంగాన్ని కార్పొరేట్‌లకు ధారాదత్తం చేస్తున్నారని దుయ్యబట్టారు. కేంద్రప్రభుత్వ వైఫల్యాల కరపత్రాలను పంచి పెట్టారు. కార్యక్రమంలో వామపక్షనేతలు రాంబాబు, కసిరెడ్డి సత్యనారాయణ, ఎ.లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేత



మృతురాలి కుటుంబ సభ్యులకు బీమా సాయం అందిస్తున్న కార్పొరేటర్ నర్సింహపాత్రుడు

పెదగంట్యాడ: పేద వర్గాలకు వైఎస్సార్ బీమా కొండంత భరోసాను ఇస్తోందని 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు అన్నారు. వార్డు పరిధిలోని భానోజీతోటకు చెందిన నానుబల్లి రామలక్ష్మి అనే మహిళ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. దీంతో ఆమె కుటుంబ సభ్యులకు వైఎస్సార్ బీమా తక్షణ సాయం కింద మంజూరైన రూ.10వేలను మంగళవారం ఆయన అందజేశారు. మిగిలిన సొమ్ము త్వరలో వచ్చేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పెద్దింటి మంగునాయుడు, జానా సతీష్, యర్రా సతీష్, పెంటి రాజు, సచివాలయ సిబ్బంది కృష్ణ, మోహన్, వలంటీర్ ఉషారాణి పాల్గొన్నారు.

పీహెచ్‌సీ సిబ్బందికి సత్కారం



పీహెచ్‌సీ సిబ్బందిని సత్కరిస్తున్న బ్రహ్మకుమారీలు

పెదగంట్యాడ: కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి వైద్య సిబ్బంది అందించిన సేవలు అభినందనీయమని బ్రహ్మకుమారీస్ ప్రతినిధి, కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ రాధ అన్నారు. బ్రహ్మకుమారీల ఆధ్వర్యంలో పెదగంట్యాడ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సేవలందిస్తున్న సిబ్బందిని మంగళవారం ఘనంగా సత్కరించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య సిబ్బంది మానసిక ఒత్తిడి నుంచి దూరం కావాలంటే ధ్యానం చేయాలని సూచించారు. ధ్యానంతో బీపీ, సుగర్ వంటి వ్యాధులను తగ్గించుకోవచ్చని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఎంవీఎస్ అన్నపూర్ణ, సిద్ధేశ్వరం యూపీఎస్సీ వైద్యాధికారి డాక్టర్ మానస, ఆరోగ్య సిబ్బందిని సత్కరించారు. వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ బహూకరించారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ, బ్రహ్మకుమారీస్ కొత్త గాజువాక ఇన్‌చార్జి మణి, బ్రహ్మకుమారీలు భవానీ, పార్వతి పాల్గొన్నారు.